## స్వరాష్ట్ర ఉద్యమకారుడిగా గర్విస్తున్నా: కప్పాటి పాండురంగారెడ్డి



**దశ, రంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి రాష్ట్ర సాధనలో తన భాగస్వామ్యాన్ని గర్వంగా గుర్తుచేసుకున్నారు. అహింసా మార్గంలో సాగిన తెలంగాణ ఉద్యమం దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. 2001లో ప్రారంభమైన ఉద్యమంలో వివిధ పదవుల్లో పని చేసే అవకాశం లభించిందని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలు, ప్రజల భాగస్వామ్యంతో 2014 జూన్ 2న తెలంగాణ కల సాకారమైందన్నారు. రాష్ట్ర అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ములుగు ప్రకృతి చారిత్రాత్మక సంపద

❖ *పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలి*



**దశ, ములుగు:** ములుగు జిల్లా ప్రకృతి అందాలు, చారిత్రక వారసత్వం, పర్యాటక విశిష్టతను సృజనాత్మక కంటెంట్ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా జిల్లాను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల సందర్భంగా ములుగు జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇన్ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్ - 2026" విజేతలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన వేడుకలలో నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

❖ *జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలు చిరస్మరణీయమని, వారి కలల తెలంగాణ నిర్మాణం కోసం సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతతో ముందుకు సాగాలని అన్నారు. ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం నింపడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఇరుగు కోటేశ్వరి, వద్దే శ్యాంసుందర్ రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం జనసేన వ్యూహం

❖ *సభ్యత్వాల పేరుతో తెలంగాణలో హడావుడి*
❖ *హైదరాబాద్‌లో సభ కోసం కోర్టుకు ఎక్కిన జనసేన నాయకులు*
❖ *తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పవన్ అడుగులు*
❖ *కూటమి ఏర్పాటుకు సంకేతాలు అంటున్న రాజకీయ విశ్లేషకులు*



**దశ, హైదరాబాద్ ప్రతినిధి:** తెలంగాణ రాజకీయాల్లో మరోసారి జనసేన పార్టీ చర్చనీయాంశంగా మారుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన, ఇప్పుడు తెలంగాణలో కూడా తన ఉనికిని బలంగా చాటుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు కనిపిస్తోంది. పార్టీ నాయకులు వరుస సమావేశాలు నిర్వహించడం, కొత్త సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, యువతను ఆకర్షించే విధంగా సోషల్ మీడియా ప్రచారాన్ని పెంచడం వంటి చర్యలు చేపడుతున్నారు.

అయితే ప్రశ్న ఒక్కటే... తెలంగాణలో జనసేన పార్టీకి నిజంగా భవిష్యత్ ఉందా? ప్రజలు ఆదరిస్తారా? లేక రాజకీయ ప్రభావం పరిమితంగానే ఉండిపోతుందా?

తెలంగాణలో జనసేన పార్టీకి ప్రధాన బలం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత ఇమేజ్. సినీ నటుడిగా, రాజకీయ నాయకుడిగా ఆయనకు యువతలో మంచి గుర్తింపు ఉంది. ముఖ్యంగా మొదటిసారి ఓటు వేసే యువ ఓటర్లలో పవన్ కళ్యాణ్‌కు అభిమాన వర్గం ఉంది. ఈ అభిమానాన్ని రాజకీయ ఓట్లుగా మార్చుకోవడమే జనసేన ముందు ఉన్న అతిపెద్ద సవాలు.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల చుట్టూనే తిరుగుతున్నాయి. ఈ మూడు పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో జనసేన పార్టీకి ప్రత్యేక రాజకీయ స్థానం సంపాదించుకోవడం అంత సులభం కాదు. అయితే రాజకీయాల్లో ఖాళీగా ఉన్న కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు వెళితే అవకాశాలు ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యంగా యువత, మధ్యతరగతి, ఉద్యోగులు, చిన్న వ్యాపార వర్గాల సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తే జనసేనకు కొంత మద్దతు లభించే అవకాశం ఉంది. అలాగే తెలంగాణలో బలమైన నాయకత్వాన్ని తయారు చేయడం కూడా పార్టీకి చాలా కీలకం. కేవలం పవన్ కళ్యాణ్ సభలు నిర్వహించడం ద్వారా కాకుండా గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో భాగస్వామిగా ఉన్న జనసేన తెలంగాణలో ఎలాంటి రాజకీయ వ్యూహం అవలంబిస్తుందన్నదనేది ఆసక్తికరంగా మారింది. భవిష్యత్‌లో బీజేపీతో కలిసి పనిచేస్తుందా? లేక స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తుందా? అనే అంశాలపై కూడా చర్చ జరుగుతోంది. తెలంగాణలో కొన్ని సామాజిక వర్గాలు, యువతలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఆదరణ పార్టీకి ఉపయోగపడవచ్చు. కానీ ఆ ఆదరణను ఎన్నికల విజయాలుగా మార్చుకోవాలంటే బలమైన సంస్థాగత నిర్మాణం అవసరం. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తల నెట్‌వర్క్, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, స్థానిక నాయకత్వం పెంపకం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

ఇక రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికలు, తదుపరి అసెంబ్లీ ఎన్నికలు జనసేనకు కీలక పరీక్షగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ ప్రదర్శన ఎలా ఉంటుందో బట్టి తెలంగాణలో జనసేన భవిష్యత్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి తెలంగాణలో జనసేన పార్టీ ప్రస్తుతం రాజకీయ హడావుడి చేస్తోందనేది వాస్తవం. అయితే ఆ హడావుడిని ఓట్లుగా మార్చుకుని బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. పవన్ కళ్యాణ్ ఇమేజ్, యువత మద్దతు, సరైన రాజకీయ వ్యూహం కలిసి వస్తే జనసేనకు అవకాశాలు ఉండొచ్చు. లేదంటే తెలంగాణ రాజకీయాల్లో ప్రభావం చూపడం కష్టమనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

రాబోయే రోజుల్లో జనసేన పార్టీ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది? తెలంగాణ ప్రజలు ఎంతవరకు ఆదరిస్తారు? అనేది ఆసక్తికర రాజకీయ చర్చగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో జనసేన నిజంగా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందా? లేక పరిమిత ప్రభావంతోనే కొనసాగుతుందా? అనే ప్రశ్నకు సమాధానం రాబోయే ఎన్నికల ఫలితాలే చెప్పనున్నాయి.



## ప్రజాపాలనతో పేదలకు న్యాయం

❖ *పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు*
❖ *ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క*

**దశ, ఖమ్మం:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనతో నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అన్ని రంగాల్లో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకవచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రామానుజం, పోలీస్ హెడ్ క్వాటర్స్ లో అడిషనల్ డీసీపీ కుమారస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్, హోంగార్డు, మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బందికి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ఏర్పాటు వేలాది మంది త్యాగాల ఫలితం: ఎంపీ ఈటెల రాజేందర్



**దశ, హైదరాబాద్ ప్రతినిధి :** అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సభలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది వేలాది మంది త్యాగాలు, పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జేఏసీ కీలక పాత్ర పోషించిందని, ఉద్యమ శక్తులన్నింటినీ సమన్వయం చేస్తూ ముందుకు నడిపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ఉద్యమ చరిత్ర, త్యాగాల గురించి నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాలను చులకనగా చూడడం బాధాకరమని, ఉద్యమ స్ఫూర్తిని కాపాడుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయుల ఆలోచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తాను ప్రత్యక్షంగా పాల్గొన్న అనుభవాలను సభలో పంచుకున్నారు. అసెంబ్లీలో తెలంగాణ ఉద్యమ త్యాగాలు, గొప్పతనం గురించి మాట్లాడిన సందర్భం తన జీవితంలో మరువలేని ఘట్టమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంపై తాను చేసిన ఉపన్యాసానికి లభించిన ఆదరణను స్మరించుకున్నారు. మానుకోట ఉద్యమం సహా తెలంగాణ సాధన కోసం జరిగిన అనేక పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రజలకు కుటుంబం, వృత్తితో పాటు సమాజంలో అన్యాయం, దుర్మార్గాన్ని ఎదిరించే బాధ్యత కూడా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## నాగోల్ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**దశ, పెద్ద అంబర్పేట్ :** పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని నాగోల్ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది జాతీయ గీతాన్ని ఆలపించి రాష్ట్ర ఆవిర్భావాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సర్కిల్ కార్యాలయానికి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**దశ, అబ్దుల్లా పూర్ మెట్:** బాటసింగారం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ PIC చైర్మన్ కొత్తపల్లి జయపాల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో PIC సభ్యులు, సంఘ సభ్యులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని FSCS మేనేజర్ జక్కుల ఐలేష్ నిర్వహించారు.



## బాటసింగారం పండ్ల మార్కెట్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**దశ, అబ్దుల్లా పూర్ మెట్:** బాటసింగారం పండ్ల మార్కెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మేకం లక్ష్మి, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, బండి మధుసూదన్ రావు తదితరులు, మార్కెట్ ఉద్యోగులు పాల్గొన్నారు.